క్లుప్తంగా

మహానందీశుడి కల్యాణానికి ముత్యాలు



ముత్యాలను అందిస్తున్న ఏఈఓ వేంకటేశ్వరుడు

మహానంది: మహాశివరాత్రి సందర్భంగా మహానందిలో కొలువైన కామేశ్వరీదేవి, శ్రీ మహానందీశ్వరస్వామి వార్ల కల్యాణానికి హైదరాబాద్‌కు చెందిన దేశగోని శ్రీనివాస్ గౌడ్, మహేశ్వరి దంపతులు బుధవారం కిలో ముత్యాలను అందించారు. దాతల తరపున కసాపురం ఏఈఓ వెంకటేశ్వరుడు ఈఓ శ్రీనివాసరెడ్డి, వేదపండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవి శంకర అవధానిలకు అందించారు. దాతలను ఆలయ ఈఓ అభినందించారు.

మల్లన్నను దర్శించుకున్న తెలంగాణ మంత్రి

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల భ్రమరాంబా మల్లికార్జున స్వామి అమ్మవార్లను తెలంగాణ రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని బుధవారం మల్లన్న దర్శనార్థం శ్రీశైలం చేరుకున్నారు. వీఐపీ బ్రేక్ దర్శన సమయంలో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి మల్లికార్జున స్వామి వారిని, అనంతరం భ్రమరాంబాదేవిని దర్శించుకున్నారు. మంత్రికి ఆశీర్వచన మండపంలో వేదపండితులు వేదమంత్రాలు పలుకగా, అర్చకులు ఆశీర్వచనాలు అందించారు. అధికారులు స్వామి వారి శేష వస్త్రాన్ని, లడ్డూ ప్రసాదాలను అందించారు.

మిర్చి రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న నరసింహులు

నందికొట్కూరు: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు మిర్చి రైతులను ఆదుకోవాలని అఖిల భారత రైతు కూలీ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు నరసింహులు డిమాండ్ చేశారు. బుధవారం సీపీఐ ఎంఎల్ న్యూ డెమోక్రసీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆరుగాలం కష్టపడి పండించిన మిర్చి రైతులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం ఘోరంగా విఫలమైందన్నారు. సమావేశంలో సంఘం జిల్లా కార్యదర్శి గోపాల్, నాయకులు ఎల్లనాయుడు, పుల్లన్న, శివవెంకటేశ్వర్లు, అశోక్ పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం



చికిత్స నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీకాంత్

జూపాడుబంగ్లా: ఎండల్లో ఎక్కువగా తిరగవద్దని ఏఆర్‌కే ఆసుపత్రి వైద్యుడు శ్రీకాంత్ సూచించారు. బుధవారం మండలంలోని కాశిరెడ్డినాయన నిత్యాన్నదాన ఆశ్రమం వద్ద భక్తులకు ఉచితవైద్య శిబిరం నిర్వహించారు. ఎండల్లో తిరగటం వల్ల డీహైడ్రేషన్‌తో వడదెబ్బకు లోనయ్యే ప్రమాదం ఉందని, గొడుగు లేదా టోపీ, టవాల్ ధరించాలని డాక్టర్ శ్రీకాంత్ సూచించారు. కార్యక్రమంలో మార్కెటింగ్ జీఎండీ రమణబాబు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా బస్టాండు మలుపు



గుంతలయమంగా మారిన జూపాడుబంగ్లా బస్టాండు సమీపంలోని మలుపు

జూపాడుబంగ్లా: కర్నూలు–గుంటూరు రహదారిపై నిత్యం హెవీలోడు(40టన్నులు పైబడి)తో పీఎస్‌కే వాహనాలు తిరుగుతుండటంతో జూపాడుబంగ్లా బస్టాండు సమీపంలోని మలుపు గుంతలమయమై ప్రమాదకరంగా మారింది. కేజీ రోడ్డుపై నిత్యం వందలాది వాహనాలు తిరుగుతుంటాయి. అసలే ప్రమాకరమైన మలుపు దీనికితోడు రోడ్డు గుంతలమయం కావటంతో ద్విచక్రవాహనాల దారులు అదుపుతప్పి నిత్యం కిందపడి గాయాలపాలవుతున్నారు. వాహనాల డ్రైవర్లు మలుపు వద్దకు చేరుకోగానే ఎదురుగా వచ్చే వాహనాలను తప్పించేందుకు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. అనుమతిలేకుండా అధిక సామర్థ్యం ఉన్న వాహనాలను కేజీ రోడ్డు వెంట తిరగరాదు. అలాంటిది పీఎస్‌కే వాహనాలు అధికసామర్థ్యంతో తిరుగుతుండటంతో రోడ్డు గుంతలమయంగా మారింది. ఇంత జరుగుతున్నా అర్‌అండ్‌బీ అధికారులు పట్టించుకోకపోవటం గమనార్హం. అధికారులు స్పందించి గుంతలను పూడ్చి రోడ్డును బాగుచేయించి వాహనాలు సవ్యంగా వెళ్లేలా చేయాలని ప్రయాణికులు, వాహనాల డ్రైవర్లు కోరుతున్నారు.



రోప్ వేలో పాతాళగంగకు వెళ్తున్న భక్తులు



భక్తులతో కిక్కిరిసిన శ్రీశైలంలోని ప్రధాన వీధి



కళాకారుల విన్యాసం



ప్రభోత్సవంలో కళాకారులు

ఉప్పొంగిన భక్తిభావం



నందికోల సేవ



పాతాళగంగ వద్ద భక్తజన సందోహం

- ఓంకార నాదంతో ప్రతిధ్వనించిన శ్రీశైల క్షేత్రం
- లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనంతో కిక్కిరిసిన ఆలయ ప్రాంగణం
- పుణ్యస్నానాలాచరించి పూజలు నిర్వహించుకున్న భక్తులు

ఆత్మకూరు: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా శ్రీశైల మహాక్షేత్రంలో భక్తిభావం ఉప్పొంగింది. ఓంకార నాదంతో నల్లమల ప్రతిధ్వనించింది. లక్షలాదిగా తరలివచ్చిన భక్తజనంతో సాక్షి గణపతి, హటకేశ్వరం, పాలధార, పంచదార క్షేత్రాలతో పాటు భీమునికొలను, అక్కమహాదేవి ఆలయాల ప్రాంగణాలు కిక్కిరిశాయి. బుధవారం పాతాళగంగలో పుణ్య స్నానాలాచరించిన భక్తులు భ్రమరాంబా మల్లికార్జునస్వామివార్లను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

పెరిగిన చిన్నారి శివస్వాములు

శ్రీశైల మహాక్షేత్రంలో ఈ యేడాది ఊహించని విధంగా చిన్నారి శివస్వాముల సంఖ్య భారీగా పెరిగింది. రెండేళ్ల నుంచి 12 ఏళ్లలోపు బాలలు పెద్ద సంఖ్యలో శివమాలధారణ వేసుకుని తరలివచ్చారు. వీరిని దేవుని ప్రతిరూపాలుగా భావిస్తూ పెద్ద వయసు శివస్వాములు కూడా నమస్కరించుకుంటూ ముందుకు సాగారు. కాగా చిన్నారి శివస్వాములు పలుచోట్ల భజనల ద్వారా నృత్యాలు చేస్తూ ఆకట్టుకున్నారు. క్షేత్రంలోని ప్రధాన మాడవీధులతోపాటు సత్రాలు, పార్కుల వద్ద చిన్నారులు భజనలు చేస్తూ అమ్మవారు, స్వామివారి గీతాలను ఆలపిస్తూ ప్రదక్షిణ కొనసాగించారు. కర్నూలు, ఆదోని, పత్తికొండ, ఆలంపూర్, మహబూబ్‌నగర్, దోర్నాల ప్రాంతాలకు చెందిన చిన్నారి శివస్వాములు ఆలపించిన గీతాలు ఆకట్టుకున్నాయి.

ఓంకారంలో..

బండి ఆత్మకూరు: మహా శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఓంకార క్షేత్రం, గుండ్ల బ్రహ్మేశ్వరం, కృష్ణ నంది, శివనంది ఆలయాలకు పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి శివ పార్వతులకు విశేష పూజలు నిర్వహించారు. భక్తులకు కాశిరెడ్డి నాయన ఆశ్రమం నిర్వాహకులు అన్నదానం చేశారు. నారాయణాపురం మెడికల్ ఆఫీసర్ డాక్టర్ కిరణ్ ఆధ్వర్యంలో మెడికల్ క్యాంపు ఏర్పాటు చేసి భక్తులకు సేవలందించారు. కాగా నంద్యాల ఏఎస్పీ జావలి ఓంకారేశ్వరుడిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

వెలుగోడు: మండలంలో ఆలయాలు భక్తులతో కిక్కిరిశాయి. వెలుగోడు శివారులో ఉన్న వన్ ఆర్ తూము వద్దకు భారీగా ప్రజలు చేరుకొని స్నానాలు ఆచరించి అక్కడే ఉన్న సర్వేశ్వరాలయంలో పూజలు చేశారు.



ఓంకార క్షేత్రంలో భక్తుల రద్దీ



ఓంకారేశ్వరునికి పూజలు చేస్తున్న ఏఎస్పీ జావలి



శంఖం పూరిస్తున్న సాధువు



బిడ్డకు స్వామిని చూపుతున్న తండ్రి


రుద్రకోడూరు క్షేత్రానికి పోటెత్తిన భక్తులు

ఆత్మకూరు/రూరల్: మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా రుద్రకోడూరు క్షేత్రానికి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. కోనేరులో పుణ్యస్నానం ఆచరించి రుద్రకోటేశ్వర, రుద్రాణిమాతకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. క్షేత్రంలోని కల్పవృక్షానికి శ్రీరామచంద్రుడి విగ్రహానికి పూజలు చేశారు. గ్రామస్తుల ఆధ్వర్యంలో ప్రభలు తీసుకెళ్లారు.





నృత్యం చేస్తున్న బాల శివస్వాములు



పార్కింగ్ స్థలంలో ఆర్టీసీ బస్సులు



చేతులెత్తి నమస్కరిస్తున్న భక్తులు



శివస్వాములకు అన్నదానం చేస్తున్న దృశ్యం

భక్తుల ఆకలి తీర్చిన దాతలు

ఆత్మకూరు: శ్రీశైల మహాక్షేత్రంలోని కైలాస ద్వారం వద్ద వైఎస్సార్‌సీపీ నాయకుడు పత్తికొండకు చెందిన మురళీధర్‌రెడ్డి ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. శివరాత్రి సందర్భంగా పాదయాత్రగా తరలివచ్చే భక్తులకు 18 ఏళ్ల నుంచి అన్నదానం చేస్తున్నట్లు మురళీధర్‌రెడ్డి తెలిపారు. ఈ యేడాది ఐదు రోజులపాటు కాలినడకన వచ్చే శివస్వాములు, భక్తులకు అన్నదానం చేసినట్లు చెప్పారు.

శ్రీశైలం టెంపుల్: శ్రీశైలం మహా క్షేత్రంలో మహాశివరాత్రి సందర్భంగా శివ దీక్షపరులకు, భక్తులకు అన్నదానం నిర్వహించారు. బుధవారం తిరుపతి నాయన ఆరాధన కార్యక్రమం శుభ సందర్భంగా శివోహం టెంపుల్ ట్రస్ట్ నిర్వాహకులు అరవిందరెడ్డి అన్నదానం చేశారు.



భక్తులకు అన్నదానం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు మురళీధర్‌రెడ్డి

అట్టహాసంగా ఎడ్ల బండలాగుడు పోటీలు



నందికొట్కూరులో బండను లాగుతున్న వృషభాలు



ఓంకారంలో..

నందికొట్కూరు: మహాశివరాత్రి పండుగ సందర్భంగా రైతు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన అంతరాష్ట్ర న్యూ కేటగిరి ఎండ్ల బండలాగుడు పోటీలు అట్టహాసంగా సాగాయి. పట్టణంలో ఏర్పాటు చేసిన పోటీలను బుధవారం కస్టమ్స్ ఆఫీసర్ వేల్పుల ఆనంద్‌కుమార్, మున్సిపల్ చైర్మన్ దాసి సుధాకర్ రెడ్డి ప్రారంభించారు. రసవత్తరంగా సాగిన పోటీలలో పెద్ద కొట్టాల గ్రామానికి చెందిన బోరెడ్డి కేశవరెడ్డి ఎద్దులు మొదటి స్థానంలో నిలిచి రూ.60 వేల నగదు బహుమతి దక్కించుకున్నాయి. గద్వాల జిల్లా శనగపల్లె గ్రామానికి చెందిన చక్రవర్తిగౌడ్, రేమట గ్రామానికి చెందిన నడిపి గిద్దయ్య ఎద్దులు రెండో స్థానంలో నిలి రూ.50 వేలు గెలుపొందాయి. హెచ్ కై రవాడి గ్రామానికి చెందిన లక్ష్మన్న వృషభాలు మూడో స్థానంలో నిలిచి రూ.40 వేలు కైవసం చేసుకున్నాయి. అలాగే ఎస్.కొత్తపల్లి గ్రామానికి చెందిన చల్లా వెంకటహారిక ఎద్దులు నాల్గవ, కడప జిల్లా సాలూరు గ్రామానికి చెందిన రాచమల్లు సుధీర్‌కుమార్‌రెడ్డి, ఎల్లాగౌడ్ ఎద్దులు ఐదోవ, పెద్దనెలటూరు, బీంపురం గ్రామాలకు చెందిన వెంకటరెడ్డి, తిప్పన్న ఎద్దులు ఆరవ, రుద్రవరం గ్రామానికి చెందిన వరలక్ష్మిగౌడ్ ఎద్దులు ఏడవ, నందికొట్కూరు చాబోలు రఫి వృషభాలు ఎనిమిదవ, వనికెందిన్నె గ్రామానికి చెందిన తలారి బాలశరబయ్య వృషభాలు తొమ్మిదవ స్థానంలో నిలిచాయి.

ఓంకార క్షేత్రంలో..

బండి ఆత్మకూరు: శివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని ఓంకార క్షేత్రంలో ఎడ్ల బండలాగుడు పోటీలు నిర్వహించారు. తొలిరోజు ఆరుపళ్ల విభాగానికి చెందిన పది జతల ఎడ్లు పాల్గొనగా నాగర్ కర్నూలు జిల్లా రామవరం గ్రామానికి చెందిన ఎం.అక్షరా రెడ్డి ఎద్దులు విజేతగా నిలిచి రూ.50 వేల నగదు బహుమతి దక్కించుకున్నాయి. పాణ్యం మండలం పిన్నాపురం గ్రామానికి చెందిన వెంకట కృష్ణయ్య ఎద్దులు ద్వితీయ స్థానంలో నిలిచి రూ.40 వేలు, ఎస్.కొత్తూరుకు చెందిన బీరం సుబ్రహ్మణ్యం రెడ్డి ఎద్దులు తృతీయ స్థానంలో నిలిచి రూ.30 వేలు, పెద్ద కొట్టాల నారాయణ రెడ్డి ఎద్దులు నాలుగవ స్థానంలో నిలిచి రూ.20 వేలు, కలసపాడుకు చెందిన బేతి వెంకటరెడ్డి ఎద్దులు ఐదవ స్థానంలో నిలిచి రూ.10 వేల నగదును గెలుపొందాయి.

శివయ్యా.. మమ్ము ఆశీర్వదించయ్యా!



దర్శనానికి బారులు తీరిన భక్తులు



పూజలు అందుకుంటున్న శంకరమల్లేశ్వరస్వామి, భ్రమరాంబికా మాత

- భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు



ప్రత్యేక అలంకరణలో కొలనుభారతిదేవి అమ్మవారు

జూపాడుబంగ్లా: మహాశివరాత్రి పర్వదినాన్ని పురస్కరించుకుని మండలంలోని తూడిచెర్ల శంకరమల్లేశ్వర స్వామి, జూపాడు బంగ్లా భుజంగేశ్వర, సిద్దేశ్వరస్వామి, ఈశ్వరాలయం, తాటిపాడు వీరభద్ర, చెన్నకేశవాలయాలతో పాటు గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిటకిటలాడాయి. ఉదయాన్నే తలంటు స్నానమాచరించి నూతన వస్త్రాలను ధరించిన స్వామి, అమ్మవార్ల దర్శనార్థం భక్తులు బారులు తీరారు. శివలింగాలకు పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. కాశిరెడ్డినాయన నిత్యాన్నదాన ఆశ్రమం భక్తులకు అన్నదానం చేశారు.

కొత్తపల్లి: మండలంలోని సప్తనదుల సంగమేశ్వరం, కొలనుభారతి ఆలయాలు మహాశివరాత్రి పర్వదినం సందర్భంగా భక్తులతో కిటకిటలాడాయి. సంగమేశ్వరాలయానికి వేకువజాము నుంచే భక్తులు బారులు తీరారు. కృష్ణా నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కృష్ణమ్మ ఒడిలో ఉన్న పురాతన ఆలయాన్ని దూరం నుంచి దర్శించుకున్నారు. ఎగువన ఉన్న ఉమామహేశ్వరాలయంలో పురోహితులు తెలకపల్లి రఘురామశర్మ ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేయించుకున్నారు. ఉమామహేశ్వరాలయంలో గుంతకల్లు జడ్జి మంజుల కుటుంబ సమేతంగా పూజల్లో పాల్గొన్నారు. కాశిరెడ్డి నాయన సత్రం ఆధ్వర్యంలో ఎర్రమఠం గ్రామానికి చెందిన గ్రామస్తులు భక్తులకు ఉచిత అన్నదానం ఏర్పాటు చేశారు. శివపురం గ్రామ శివారులోని కొలను భారతి ఆలయంలో సరస్వతీ దేవికి భక్తులు పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

పాములపాడు: శ్రీశైలానికి ప్రథమ ముఖద్వారం నందీశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు భవనాశి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి ఇస్కాల నందీశ్వరాలయంలో పూజలు చేశారు.

మిడుతూరు: మిడుతూరుతోపాటు పీరుసాహెబ్ పేట, జలకనూరు, రోళ్లపాడు, తలముడిపి, మాసపేట, పైపాలం, వీపనగండ్ల , చెరుకుచెర్ల తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తులతో కిక్కిరిశాయి. మహాశివరాత్రి పర్వదిన వేడుకలు భక్తిశ్రద్ధలతో నిర్వహించుకున్నారు. స్థానిక రామేశ్వర స్వామి ఆలయంలో స్వామివార్లకు అభిషేకం, కుంకుమార్చన, పుష్పార్చన, బిల్వార్చన, తదితర పూజలలు నిర్వహించారు. భక్తులు ఉపవాస దీక్ష చేపట్టి స్వామివార్లకు కాయ, కర్పూరం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

పగిడ్యాల: మహాశివరాత్రి వేడుకలను పురస్కరించుకుని పీకే ప్రాగటూరు, నెహ్రూనగర్, పాత, కొత్త ముచ్చుమర్రి, బీరవోలు, పగిడ్యాల, పాలమర్రి, లక్ష్మాపురం, తూర్పు, పడమర ప్రాతకోట, ఘణపురం తదితర గ్రామాల్లోని శివాలయాలు భక్తుల సందడితో బుధవారం కళకళలాడాయి. పవిత్ర స్నానాలు ఆచరించిన భక్తులు శివనామ స్మరణ చేస్తూ పూజలు నిర్వహించారు.



పగిడ్యాల బంగ్లా కట్ట సర్వేశ్వరస్వామి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు

భక్తుల నిలువు దోపిడీ

- ఉచిత సేవలు ఉత్తుత్తే.. ప్రతి సేవకూ వెల కట్టి వసూలు
- ఇబ్బంది పడిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని శ్రీగిరికి తరలివచ్చిన భక్తులను ఉచిత సేవలు కల్పిస్తామన్న అధికారుల ప్రగల్భాలు ఉత్తుత్తేనని తేలిపోయింది. ప్రతి సేవకూ వెల కట్టి భక్తులను నిలవు దోపిడీ చేస్తున్నా అడిగే నాథుడేలేరు. మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలకు వివిధ రాష్ట్రాల నుంచి లక్షలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తుల అవసరాలను ఆసరాగా చేసుకుని కొందరు నిలువు దోపిడీ చేస్తున్నారు. వివిధ ప్రాంతాల నుంచి ఏర్పాటు చేసిన బస్సులలో స్పెషల్ బస్సుల పేరుతో అధిక చార్జీలు వసూలు చేస్తున్నారు. శ్రీశైలానికి చేరుకున్న తర్వాత కూడా ఎక్కడ చూసినా అధిక డబ్బు వసలు చేస్తున్నారు. సాక్షి గణపతి, నంది మండపం, గంగాధర మండపం వద్ద భక్తులు కొబ్బరికాయలు కొడతారు. ఆయా ప్రదేశాలలో కొబ్బరికాయలు కొట్టేందుకు దేవస్థానం అర్చకులను నియమిస్తుంది. కానీ ఆలా గాకుండా కొబ్బరి కాయల టెండర్‌దారుడు ప్రత్యేకంగా కొందరిని ఏర్పాటు చేసి కొబ్బరికాయలను కొట్టిస్తున్నాడు. ఒక్కో కొబ్బరికాయకు రూ.10 చొప్పున ముక్క పిండి వసూలు చేస్తున్నారు. చంద్రావతి కల్యాణ మండపం వద్ద శివస్వాములకు ప్రత్యేక క్యూలైన్ ఏర్పాటు చేశారు. అక్కడ శివభక్తులు లగేజ్ భద్రపర్చుకునేందుకు లాకర్లు ఏర్పాటు చేశారు. ఈ లాకర్లను ప్రైవేట్ వారు నిర్వహిస్తున్నారో, దేవస్థానం నిర్వహిస్తుందో తెలియని పరిస్థితి. లగేజ్‌కి రూ.50 చొప్పున వసూలు చేస్తున్నారు. ఇక మరుగుదొడ్లకు రూ.10, స్నానానికి రూ.20 వసూలు చేస్తున్నారు. దేవస్థానం ఉచిత మరుగుదొడ్లతో పాటు, తాత్కాలిక మరుగుదొడ్లు సైతం ఏర్పాటు చేశామని చెబుతున్నా నామమాత్రమేనని భక్తులు ఆరోపిస్తున్నారు. తలనీలాలు సమర్పిస్తే రూ.100 పుచ్చుకోవాల్సిందేనని భక్తులు వాపోతున్నారు. ఇంత దోపిడీ జరుగుతున్నా అధికారులు పట్టించుకోవడంపై భక్తుల నుంచి విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



కొబ్బరికాయ కొట్టి డబ్బు వసూలు చేస్తున్న దృశ్యం